గ్రామాల్లో హరిత నర్సరీలు

- జిల్లాలోని 311 పంచాయతీల్లో పనులు ప్రారంభం
- ఈ ఏడాది లక్ష్యం 26,36,499 లక్షల మొక్కలు

మండలాలు మొక్కల పెంపకం లక్ష్యం లక్షల్లో...

బెల్లంపల్లి	1.70	కన్నెపల్లి	1.43
భీమారం	1.01	కాసిపేట	1.63
భీమిని	1.22	కోటపల్లి	1.84
చెన్నూర్	2.88	లక్సెట్టిపేట	1.55
దండేపల్లి	1.12	మందమర్రి	1.01
హాజీపూర్	1.45	నెన్నెల	1.82
జైపూర్	1.98	తాండూరు	1.59
జన్నారం	1.62	వేమనపల్లి	1.40


భీమారం నర్సరీలో కవర్లలో మట్టి నింపుతున్న కూలీలు

భీమారం: పదో విడత హరితహారం కార్యక్రమం కోసం మొక్కల పెంపకానికి జిల్లాలోని గ్రామాల్లో నర్సరీ పనులు ప్రారంభించారు. జిల్లాలోని 311గ్రామ పంచాయతీల్లో జనాభాకు అనుగుణంగా 26,36,499 లక్షల మొక్కల పెంపకం లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు గ్రామాల్లో మొక్కల పెంపకం కోసం మొదట చేపట్టే పనులు ప్రారంభించారు. ఇప్పటికే ఎర్రమట్టిని తరలించి కూలీల ద్వారా ప్లాస్టిక్ కవర్లలో నింపించారు. ఇంకా కొన్ని గ్రామాల్లో నింపే పనులు చేపడుతున్నారు. కాగా అటవీశాఖ కూడా వారి నర్సరీల్లో ఈసారి మొక్కల పెంపకాన్ని చేపట్టనుంది.

నర్సరీ పనుల ద్వారా కూలీలకు ఉపాధి..
జిల్లావ్యాప్తంగా గల నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టే పనులను ఉపాధిహామీ కూలీలను ఉపయోగిస్తున్నారు. దీనిద్వారా కూలీలకు పని లభిస్తోంది. బ్యాగుల్లో మట్టినింపి మొక్కలు బ్యాగులో నాటేవరకు పనులు కూలీలే చేస్తారు. ఇతర పనులతోపాటు ఇది అదనంగా లభిస్తుంది.

ప్రజలకు అవసరమైన మొక్కలు..
గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మొక్కలు తెలుసుకుని వాటిని పెంచేందుకే అధికారులు దృష్టి పెడుతున్నారు. దీంతో హరితహారం కింద గ్రామాల్లో అందించే మొక్కలకు మంచి డిమాండ్ వచ్చింది. ఇందులో జామ, నేరేడు, దానిమ్మ, నిమ్మ, పండ్ల మొక్కలతోపాటు పూల మొక్కలు పెంచేందుకు అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు.

కార్యదర్శులకు అటవీశాఖ శిక్షణ
గతంలో గ్రామపంచాయితీలకు అటవీశాఖ అధికారులు వారి నర్సరీల్లో పెంచే మొక్కలనే సరఫరా చేసేవారు. అయితే గత నాలుగేళ్ల నుంచి ప్రభుత్వం పంచాయతీల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నర్సరీలు ఏర్పాటు చేసింది. అయితే నర్సరీల పెంపకం చేపట్టినా అనుకున్న స్థాయిలో ఫలితాలు ఇవ్వకపోవడంతో అటవీశాఖ నర్సరీలకు కార్యదర్శులను తరలించి అక్కడ ప్రత్యేక శిక్షణ ఇప్పించింది.

మట్టి ఎంపికలో జాగ్రత్తలు
గ్రామపంచాయితీల్లో పెంచుతున్న నర్సరీలో ఏర్పాటు చేస్తున్న మొక్కల నర్సరీల్లో కీలకంగా ఉపయోగపడే మట్టి ఎంపికలో పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా మట్టిలో బెడం ఉంటే మొక్కలు ఎదగడం లేదని గుర్తించి నాణ్యమైన మట్టి వేటలో పడ్డారు.

డిమాండ్ మొక్కలకే ప్రాధాన్యం



ప్రజల డిమాండ్ మేరకు వారు కోరిన మొక్కల పెంపకం కోసం ప్రాధాన్యం ఇస్తున్నాం. హరితహారం కింద పంపిణీ చేస్తున్న మొక్కలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. జిల్లాలోనే భీమారం మొక్కలకు మంచి గుర్తింపు వచ్చింది. – శ్రీనివాస్, ఎంపీడీవో, భీమారం

లక్ష్యం సాధిస్తాం



జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో 2023–24 సంవత్సరానికి గాను నిర్దేశించిన లక్ష్యాలను సాధిస్తాం. పంచాయతీల్లో జనాభాను బట్టి 26.36499లక్షల మొక్కలు పెంచేందుకు ప్రణాళికలు తయారు చేశాం. ప్రతిరోజూ నర్సరీని పర్యవేక్షించి మొక్కలను పెంచాల్సిన బాధ్యత కార్యదర్శులకు అప్పగించాం.
– శేషాద్రి, డీఆర్‌డీవో, మంచిర్యాల

కోరం పెరిగితే అవిశ్వాసమే..!


లక్సెట్టిపేట మున్సిపల్ కార్యాలయం


కాంగ్రెస్‌లో చేరుతున్న కౌన్సిలర్ సురేష్ నాయక్

- పార్టీలు మారుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- అంతర్గతంగా విభేదాలు

లక్సెట్టిపేట: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పలు మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు మారుతున్నందునా అవిశ్వాసం ఏర్పడుతుందా అనేది ప్రజల్లో అనుమానం వ్యక్తం అవుతోంది. నూతన ప్రభుత్వం ఏర్పడటం ఎమ్మెల్యేగా కొక్కిరాల ప్రేంసాగర్‌రావు రావడంతో మున్సిపాలిటిలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. బీఆర్ఎస్ పార్టీ ఒకటో వార్డు కౌన్సిలర్ సురేష్‌నాయక్ ఆదివారం కాంగ్రెస్‌లో చేరడంతో మున్సిపాలిటీలో ఉత్కంఠ నెలకొంది. మార్పులు ఇంతటితో ఆగిపోతాయా, ఇంకా ఎవరైనా చేరుతారా అనేది సంశయాత్మకంగా ఉంది. స్వచ్ఛందంగా వెళ్తున్నారా లేక పార్టీలో విబేదాలు వస్తున్నాయా అనేది అంతుచిక్కడం లేదు. కౌన్సిలర్ల సంఖ్య కాంగ్రెస్ పార్టీలో పెరిగితే అవిశ్వాసం తప్పదని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇంకా కొంతమంది కౌన్సిలర్లు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు మంతనాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేలా చేరితే మున్సిపల్ అవిశ్వాస తీర్మానం ఏర్పడటం జరుగుతుందని ప్రజలు అనుకుంటున్నారు.

మున్సిపల్ కౌన్సిలర్లు..
మున్సిపల్ పరిధిలో పదిహేను వార్డులున్నాయి. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తొమ్మిది వార్డులు గెలువగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 5వార్డులు గెలువగా ఇండిపెండెంట్‌గా ఒక్క అభ్యర్థి గెలిచారు. ప్రస్తుతం కాంగ్రెస్‌కు ఇండిపెండెంట్ అభ్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి చేరడంతో కాంగ్రెస్ సభ్యులు ఏడుకు చేరుకోగా బీఆర్ఎస్ అభ్యర్థులు ఎనిమిది మంది మిగిలి ఉన్నారు. ఇంకా ముగ్గురు కాంగ్రెస్ పార్టీలో చేరితే ఖచ్చితంగా అవిశ్వాసం ఏర్పడుతుందని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఎన్నికవుతారని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఒకవేల అవిశ్వాసం ఏర్పడితే చైర్మన్, వైస్ చైర్మన్ ఎవరు ఉంటారనేది ఇంకా తెలియడం లేదు. అవిశ్వాసం ఏర్పడితే చైర్మన్ కుర్చీకి ముగ్గురు భరిలో ఉన్నట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల గడిస్తే పూర్తిగా సమాచారం ఉంటుందని, ఇంకా రహస్య మంతనాలు కొనసాగుతున్నాయని ఒకవేల కాంగ్రెస్ కోరం పెరిగితే చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు కాంగ్రెస్‌కు దక్కుతాయని అనుకుంటున్నారు. పార్టీలు, నాయకులు మారినా మున్సిపాలిటీని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం 18వ తేదీ సోమవారం ఉదయం 11గంట లకు ఎంపీపీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌హై తెలిపారు. స మావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులతో పా టు వివిధ శాఖల మండల అధికారులు తాజా నివేదికలతో విధిగా హాజరు కావాలన్నారు.

క్లుప్తంగా

సినిమా నిర్మాణ అడ్‌హక్ కమిటీ ఎన్నిక

పాతమంచిర్యాల: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్యపై తెలంగాణలో ఉన్న సబ్బండ వర్గాలు కలిసి సినిమా తీయడం చాలా గొప్ప విషయమని మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్ట్ భవన్‌లో ఆదివారం దొడ్డి కొమురయ్య సినిమాపై చిత్ర దర్శకుడు సేనాపతితో సమావేశం నిర్వహించారు. సినిమా నిర్మాణ అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా నరెడ్ల శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా గంట శ్రీశైలం, జిల్లా కన్వీనర్‌గా కంది శ్రీనివాస్, కో కన్వీనర్‌గా మంతెన గట్టయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పలు కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు ప్రకటనపై హర్షం

జైపూర్: తెలంగాణ అసెంబ్లీలో ప్రభుత్వం సీపీఎస్ రద్దుపై సానుకూలంగా స్పందించడంతో ఎస్‌జీటీయూ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పి.శ్రీకర్, ప్రధానకార్యదర్శి ఆళ్ల రాజేందర్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 317జీవో సమీక్ష, మొదటి తేదీన వేతనాలు, విద్యారంగ సమస్యల మీద ఉపాధ్యాయ సంఘాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చిస్తామని పేర్కొనడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లుగా వారు పేర్కొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

శ్రీరాంపూర్: ఫ్రెండ్స్ యూత్ సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. శనివారం రాత్రి నస్పూర్ నుంచి మంచిర్యాల రైల్వేస్టేషన్ వరకు రోడ్డు పక్కన, డివైడర్లపై పడుకొని చలికి ఇబ్బంది పడుతున్న వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు రౌతు సత్యనారాయణ, సభ్యులు పండుగ శ్రీధర్, మహేశ్, కటకం మహేశ్, గంగానాయక్, మంతెన సమరం, సుధాకర్, రవికుమార్ పాల్గొన్నారు.


పెన్షనర్ల దినోత్సవం

దండేపల్లి: జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని దండేపల్లిలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనం వద్ద పలువురు విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సై కుందారపు ప్రసాద్, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకర్ గౌడ్, లచ్చన్నబాపు, సత్యనారాయణ, సుగుణాకర్, కాంతయ్య, లక్ష్మణ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

దండేపల్లి: మండలంలోని మేదరిపేట బస్టాండ్ సమీపంలో రహదారి పక్కన నిర్మించే డ్రెయినేజీ పనులను ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. డ్రెయినేజీ లేక స్థానికులు ఇబ్బందులు పడటంతో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆదేశాల మేరకు మండల పరిషత్ నిధుల ద్వారా డ్రెయినేజీ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్, ఎంపీటీసీలు నవీన్, కమలాకర్, మాజీ జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ ప్రవీణరెడ్డి, నాయకులు త్రిమూర్తి, సత్యంరావు, వెంగల్‌రావు, రాజేష్, రాజేందర్, రాజారావు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షర్మిల పుట్టినరోజు వేడుకలు


కేక్ కట్ చేస్తున్న నాయకులు

మంచిర్యాల క్రైం: వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల పుట్టిన రోజు వేడుకలను పార్టీ నాయకులు ఆదివారం స్థానిక ఐబీ ఆవరణలో ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ బెజ్జంకి అనిల్ ఆదేశాల మేరకు ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పద్మ, ప్రధాన కార్యదర్శి జితేందర్, జిల్లా కార్యదర్శి సంతోష్, నాయకులు సాయికుమార్, సమీర్, రాజేశ్వరి, మనోజ్‌కుమార్, మహేష్, సంపత్, శ్యాంకుమార్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.
మందమర్రిరూరల్: వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల పుట్టిన రోజు వేడుకలను పట్టణంలో కేక్ కట్ చేసి వైఎస్సార్‌టీపీ నాయకులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అజీమొద్దీన్, ప్రభుదేవ్, కవిరాజ్, సమీర్, రాజు, చరణ్, చందర్, సుందర్, సతీష్ ఉన్నారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించగా కోరం లేకపోవడంతో ఎంపీడీఓ రాధాకృష్ణ వాయిదా వేశారు. సమావేశం 2గంటలకు ప్రారంభమైనప్పటికీ ఎవరు రాకపోవడంతో అరగంట చూసిన తర్వాత వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ ప్రకటించారు.

అసెంబ్లీ ఎన్నికలపై సమీక్ష సమావేశం

బెల్లంపల్లి: నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమీక్ష సమావేశానికి ఆదివారం బెల్లంపల్లికి చెందిన మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి హాజరయ్యారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్‌బన్సాల్ హాజరైన ఈ సమావేశంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడానికి గల కారణాలను సమీక్షించారు. భవిష్యత్‌లో పార్టీ తీసుకునే నిర్ణయాలు, వచ్చే ఎన్నికల్లో పార్టీ అనుసరించే కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా సునీల్‌బన్సాల్‌కు ఆత్మీయ సన్మానం చేశారు. సమావేశంలో కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యేలు, పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్యేలకు సన్మానం
మంచిర్యాలటౌన్: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలను ఆదివారం మంచిర్యాల బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి సన్మానించారు. నిర్మల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లను సన్మానించి, అభినందనలు తెలిపారు.


సునీల్‌బన్సాల్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీలో చేరిన సర్పంచ్, ఉపసర్పంచ్
దండేపల్లి: మండలంలోని మేదరిపేట సర్పంచ్ డాంక లక్ష్మణ్, కొత్తమామిడిపల్లి ఉపసర్పంచ్ నలిమెల మహేష్, పీఏసీఎస్ డైరెక్టర్ సంతోష్‌తో పాటు, పలువురు బీఆర్ఎస్ పార్టీ నుంచి ఆదివారం బీజేపీలో చేరారు. బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఆధ్వర్యంలో నిర్మల్‌లో పార్టీలో చేరిన వారికి నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ సోయంబాపురావు, ఎమ్మెల్యేపాయల్ శంకర్, ముధోల్ ఎమ్మెల్యే రామరావుపటేల్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, నాయకులు సురేందర్, శేఖర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఎజెండా కోసం ఉద్యమించాలి

పాతమంచిర్యాల: బీసీ వర్గ ప్రజల ఆకాంక్షల సాధన కోసం ఉద్యమిస్తామని బీసీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ వడ్డెపల్లి మనోహర్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం బీసీ భవన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ వర్గాల ప్రజలు ఐక్యంగా ఉద్యమించి బీసీ జనఘణనను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. బీపీ మండల్ కమిషన్ సిపార్సుల పూర్తిగా అమలు చేసి, ప్రభుత్వం బీసీల సంక్షేమానికి నిర్దిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బెల్లంపెల్లి చౌరస్తాలో పూలే జ్యోతిబాపూలే విగ్రహాన్ని నెల కొల్పుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముకేష్ గౌడ్, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, బీసీ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, గాండ్ల తేలికుల సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి, నాయిబ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలువేరు పున్నం, నాయకులు సమ్ము రాజన్న, గురిజల రవీందర్‌రావ్, కోటి లింగం, మొగిలి తిరుపతి, సోమన్న, సాగర్, ఆకిల్ పాల్గొన్నారు.


బీసీ భవన్ ప్రారంభిస్తున్న బీసీ సంఘాల నాయకులు

విజయవంతంగా ఉచిత భోజన కార్యక్రమం

మంచిర్యాలటౌన్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో నిత్య ఉచిత భోజన కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని లయన్స్ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో లయన్స్‌క్లబ్ సభ్యులు ఉచిత భోజన కార్యక్రమం ప్రారంభించి 50రోజులైన సందర్భంగా సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి ప్రతిరోజు 300పైగా వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారని వారికి మధ్యాహ్న భోజనాన్ని అందించే కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రారంభించగా, ఎంతో మందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మంచిర్యాల అధ్యక్షుడు బాలాజి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, ట్రస్టు చైర్మన్ గోనె శ్యాంసుందర్‌రావు, కార్యదర్శి కె.భాస్కర్ రెడ్డి, రీజనల్ చైర్‌పర్సన్ డేగ బాబు, కె.సుగుణాకర్ రెడ్డి, రాంచందర్, వి.మధుసూదన్ రెడ్డి, రామాంజనేయులు, వినయ్ కుమార్, పి.హన్మంతరావు, ఇరుకుల్ల ఆనంద్, చంద్రదత్, డాక్టర్ రమణ, డాక్టర్ అన్నపూర్ణ, గుండా శ్రీనివాస్, తేజ ప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఆధ్యాత్మికం

ఘనంగా మల్లన్న బోనాలు



భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లో ఆదివారం భక్తులు మల్లన్న దేవుడికి బోనాలు సమర్పించారు. భక్తులు కొత్త బియ్యంతో పాయసాన్ని వండి పలు రకాల కూరగాయలతో చేసిన వంటలతో మల్లన్నకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాల వద్ద పట్నాలు వేసి ఇంటిల్లిపాదిని చల్లంగా చూడాలని వేడుకున్నారు.

పల్లెల్లో ఘనంగా బోనాలు
నెన్నెల: సష్టి బోనాల్లో భాగంగా మండలంలో మొదటి ఆదివారం మల్లన్న దేవుడికి భక్తులు నియమ నిష్టలతో బోనాలు సమర్పించారు. కొత్త కుండలో కొత్త బియ్యం, బెల్లం, పాలతో తయారు చేసిన పాయసాన్ని మల్లన్న దేవుడికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఇంటా గడపగడపకూ బంతిపూల తోరణాలు కట్టి అలంకరణ చేశారు. పిల్లా పాపలతో చల్లగా ఉండాలని వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని దేవుడిని వేడుకున్నారు.

భీమారంలో బోనాలు
భీమారం: మండల కేంద్రంలోని యాదవులు ఆదివారం రాత్రి మల్లన్న స్వామి షష్టిబోనాల ద్వారా మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం వేళ గ్రామపొలిమేరల్లో గల మట్టి (బంగారం) తెచ్చారు. అనంతరం మల్లన్న దేవుడికి పూజలు నిర్వహించి బెల్లంతో తయారు చేసిన ప్రసాదాలు అందజేశారు.

గోదావరి తీరాన సట్టి వారాల సందడి


ముల్కల్ల పుష్కర ఘాట్ వద్ద భక్తుల సందడి


మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామ శివారులోని గోదావరి తీరం భక్తులతో సందడి నెలకొంది. కార్తీక మాసం ముగియగా ఈ నెల 12న సట్టి వారాలు మొదలయ్యాయి. అయితే 13వ తేదీన పాలి పాడ్యమీ నుంచి వచ్చిన మొదటి ఆదివారం కావడంతో మల్లన్న దేవుడికి బోనాలు సమర్పించుకోవడం ఆరంభం కాగా గోదావరిలో భక్తుల పుణ్యస్నానాల సందడి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం గోదారమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సట్టి వారాల్లో భాగంగా మల్లన్న దేవుడికి ఉపవాసాలు ఉంటూ పాల పదార్థాలు తీసుకోకుండా దీక్షలో ఉంటారు. దీంతో సట్టివారాల ఆరంభంలో భాగంగా గోదావరి పుణ్యస్నానాలు ఆచరించగా మరో రెండు ఆదివారాలు కూడా భక్తులు పెద్ద ఎత్తున మల్లన్నకు బోనాలకు సమర్పించుకుంటారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

జైపూర్: మండల కేంద్రంలో గల భూనీల సమేతా శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి ఐదు రోజుల పాటు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభోపేతంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం బ్రహోత్సవాలకు సంబంధించిన అన్నిరకాల ఏర్పాట్లను ఆలయ ప్రధాన నిర్మాణ దాత బల్మూరి ఉష-అరవీందర్‌రావు ఆధ్వర్యంలో చేపట్టారు. ఆలయం ముందు ఏర్పాటు చేసిన యాగశాలలో ప్రత్యేక హోం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు తొలిరోజున ప్రారంభం కానున్నాయి. వేధపండితులతో నిర్వహించే వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో సమీప ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పూజల అనంతరం ఐదు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.


భూనీలసమేతా శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం

గంగోత్రి పాదయాత్ర భక్తులకు పండ్లు పంపిణీ

బెల్లంపల్లి: పవిత్ర పుణ్యక్షేత్రం గంగోత్రి నుంచి రామేశ్వరం వరకు పాదయాత్ర చేస్తున్న భక్తులకు ఆదివారం బెల్లంపల్లిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ సాదర స్వాగతం పలికి పండ్లు పంపిణీ చేశారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహంకాళి అమ్మవారి భక్తులు శివ నారాయణ్, ప్రేమ్ నారాయణ్, రామ్‌సింగ్, భూపెన్‌సింగ్, గంగోత్రి జలాలతో గత అక్టోబర్ 15న పాదయాత్రగా బయలు దేరారని తెలిపారు. వెంట తీసుకెళ్తున్న గంగోత్రి గంగాజలాన్ని రామేశ్వరంలోని ఆలయంలో కలపనున్నట్లు తెలిపారు. ఈ మేరకు పాదయాత్ర చేస్తున్న భక్తులను శాలువాతో సన్మానించి అభినందించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేశవ రెడ్డి, గోవర్ధన్, మోహన్, శ్రావన్‌కుమార్, ప్రకాష్ పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

నేడు వైద్య శిబిరం

శ్రీరాంపూర్: సింగరేణి ఆధ్వర్యంలో సోమవారం ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డీజీఎం(పర్సనల్) అరవిందరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నస్పూర్ కాలనీలోని సేవా భవన్‌లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు కొనసాగుతుందని, దీర్ఘకాలిక, ఇతర జబ్బులతో బాధపడేవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వగ్రామానికి పెద్దపెల్లి ఎంపీ వెంకటేశ్ నేత

జన్నారం: పెద్దపెల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత స్వగ్రామైనా జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామానికి ఆదివారం చేరుకున్నాడు. ఆయనకు సర్పంచ్ జాడి గంగాధర్‌తో పాటు గ్రామస్తులు చంద్రయ్య, మల్లేశ్, వెంకటస్వామి స్వాగతం పలికారు. ఎంపీతో పాటుగా హైకోర్టు న్యాయవాది రాజేశ్‌నేత హాజరయ్యారు. గ్రామస్తులతో కలిసి మంచి చెడు, గ్రామ అభివృద్ధి గురించి చర్చించుకున్నారు.


ఎంపీకి స్వాగతం పలుకుతున్న సర్పంచ్

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

మందమర్రిరూరల్: పట్టణంలోని పలుచోట్ల విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. 440వాట్స్ విద్యుత్ తీగలు ఇంటిపై కప్పులపై నుంచి వెళ్లగా, ఆ తీగలకు ప్లాస్టిక్ పైపులు తొడిగా రే తప్పా వాటిని తొలగించలేదని పలువురు చర్చించుకుంటున్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టే క్రమంలో విద్యుత్ లైన్‌కు రెండు నుంచి మూడు మీటర్ల దూరం వదలాల్సి ఉంటుంది. విద్యుత్ తీగల కంటే ముందుకు నిర్మాణాలు వచ్చేలా ఎందుకు అనుమతించారని పలువురు ప్రశ్నిస్తున్నారు. మామూళ్లకు ఆశపడే అధికారులు విద్యుత్ తీగలకు ప్లాస్టిక్ పైపులు తొడిగారని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో శాంతినగర్ ఏరియాలో నూతనంగా ఇంటిని నిర్మిస్తుండగా విద్యుత్ తీగలు ఇంటికి సమీపంలో ఉండడంతో నిచ్చెన పక్కకు తీసే క్రమంలో తీగలకు తగిలి ప్రమాదం సంభవించగా, అదృష్టవశాత్తు ప్రాణాపాయం తప్పి చేతులు కోల్పోవాల్సి వచ్చింది. అయినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

ఇష్టారీతిగా ఇంటి నిర్మాణాలు..
మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో 1/70 ఆక్ట్ అమల్లో ఉండడంతో పాటు ఎలాంటి పట్టా భూమి లేకపోవడంతో ఇంటి నిర్మాణాలు చేపట్టే వారికి ఎలాంటి హద్దులు లేకపోవడంతో ఇష్టారీతిగా నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్నిచోట్ల మున్సిపాలిటీ వారు నిర్మించిన కాలువలు సైతం కబ్జా చేపట్టిన నిర్మాణాలున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.


మార్కెట్‌లోని ఓ షాపు మొదటి అంతస్తు మెట్ల వద్ద...